క్లుప్తంగా

ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): దళిత, గిరిజనులకు జగ్జీవన్ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ బుధవారం ఓ ప్రకటనలో కోరింది. 200 యూనిట్లు విద్యుత్ వాడుతున్న దళిత, గిరిజన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని, దీన్ని 300 యూనిట్లకు పెంచాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో దళిత, గిరిజన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ పథకం అమలు కావడం లేదని తెలిపారు. 150 యూనిట్లలోపు ఉన్న వారికి బిల్లులు ఎక్కువ చూపించి బిల్లులు చెల్లించని వారిని భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బిల్లులు కట్టనివారి మీటర్లు తొలగించారని తెలిపారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు పరిశీలన చేసి దళిత, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

186 మద్యం సీసాలు స్వాధీనం

ఏలూరు టౌన్: ఏలూరు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఏలూరు ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఏలూరు రూరల్ ప్రాంతంలో అక్రమంగా మద్యం నిల్వ చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, భారీగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఏలూరు ఎక్సైజ్ సీఐ జీఎస్‌కే ధనరాజ్ తెలిపారు. ఏలూరు జిల్లా ఎక్సైజ్ అధికారి అవులయ్య ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో 144 మద్యం సీసాలు కలిగిన మరడాని వెంకట రాజారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఏలూరు రూరల్ కలకుర్రులో ఒక వ్యక్తి 20 మద్యం సీసాలు, పెదవేగి మండలం రాట్నాలమ్మకుంటలో మరో వ్యక్తి 22 మద్యం సీసాలు కలిగి ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పీ.సుధీర్, ఎస్సై ఆరీఫ్ ఉన్నారు.

విద్యార్థుల మధ్య రగడ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో విద్యార్థుల మధ్య గొడవలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. కళాశాలల వద్ద ప్రారంభమైన వివాదాలు కొట్లాటకు దారి తీస్తున్నాయి. బుధవారం రాత్రి కళాశాలలు వదిలిన అనంతరం ఇళ్లకు వెళ్లే క్రమంలో నగరంలోని రెండు ప్రైవేటు కళాశాలల విద్యార్థులు బాహాబాహీకి దిగి కొట్టుకున్నారు. ఏలూరు శివారు ఆర్టీఓ కార్యాలయం ప్రాంతంలో వేచి ఉన్న విద్యార్థులు మరో కళాశాలకు చెందిన బస్సును ఆపి విద్యార్థులను కిందకు దింపి దాడి చేసి కొట్టారు. ఇరువర్గాలు భారీగా చేరి కొట్లాటకు దిగడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి విద్యార్థులకు సర్ది చెప్పారు. ఈ గొడవకు కారణమైన కొందరు విద్యార్థులను ఏలూరు రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది.


బీజేపీ క్రియాశీల సభ్యత్వాల నమోదు

ఏలూరు (టూటౌన్): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని బుధవారం తీసుకున్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం దెందులూరు మండల బీజేపీ అధ్యక్షుడు మందూరి బుజ్జి గోపాల్ చేతుల మీదుగా క్రియాశీల సభ్యత్వాన్ని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అందుకున్నారు. జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికి 1.07 లక్షల వేల మంది బీజేపీ సభ్యత్వాలు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోటప్రోలు కృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభరాణి పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఏలూరుటౌన్: ఏలూరు నగరంలో బీఎస్ఆర్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో యువతకు కంప్యూటర్ శిక్షణ ఉచితంగా అందించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరు ఆర్ఆర్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలోని బీఎస్ఆర్ కంప్యూటర్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్న బీఎస్ఆర్ కంప్యూటర్స్ యాజమాన్యం పూర్ణచంద్‌ను ఆయన అభినందించారు.

హాకీలో సుబ్బమ్మదేవి స్కూల్ విద్యార్థికి పతకం



రాజాకార్తీక్

ఏలూరు రూరల్: ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ హకీ రాష్ట్రస్థాయి పోటీల్లో ఏలూరులోని ఈదర సుబ్బమ్మదేవి మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి రాజాకార్తీక్ కాంస్య పతకం సాధించాడని హెచ్ఎం పి.కుటుంబరావు తెలిపారు. చదువుతో పాటు ఆటల పోటీల్లో సైతం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని కొనియాడారు. క్రీడాకారుడుతో పాటు పీడీ ఎన్ లీలాలక్ష్మీ, జె సునీతను ఆయన అభినందించారు.

డ్రెయినేజీల నిర్వహణలో నిర్లక్ష్యం

- కొరవడిన అజమాయిషీ.. లోపించిన జవాబుదారీతనం
- నగరపాలక సంస్థ పరిధిలోని డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడిక
- వర్షాలతో నగర వాసులకు తప్పని అవస్థలు
- జిల్లా అధికారుల కార్యాలయాల చుట్టూ అధ్వానంగా డ్రెయినేజీలు



ఏలూరు ఆర్ఎం ఆఫీసు ప్రహరీ గోడను ఆనుకుని డ్రెయినేజీ దుస్థితి



ఇండోర్ స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద పూర్తిగా పూడుకుపోయిన డ్రెయినేజీ

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ పరిధిలో చాలా చోట్ల డ్రెయిన్లు పూడికతో నిండిపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది. ఎక్కడో మారు మూల ప్రాంతంలో డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదంటే అతిశయోక్తి కాదు. కానీ సాక్షాత్తు జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, నిత్యం వేలాది మంది ప్రజలు సంచరించే ప్రధాన కూడళ్లలోనే డ్రెయినేజీల పరిస్థితి దారుణంగా ఉండటంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మరో వైపు ప్రజాప్రతినిధులు మాత్రం డ్రెయిన్లను శుభ్రం చేసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు ప్రకటిస్తూ, అప్పుడప్పుడు ఫొటోలకు ఫోజులిచ్చి వెళుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పారిశుద్ధ్యం చర్యలపై చెప్పే మాటలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోవడం పట్ల ప్రజలు విస్తు పోతున్నారు. ఎంతో ముఖ్యమైన కలెక్టరేట్, ఆర్టీసీ ఆర్ఎం, ఇండోర్ స్టేడియం, స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచి వంటి ప్రధాన ప్రాంతాల్లోనూ డ్రెయినేజీల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో అధ్వాన పరిస్థితులు నెలకొని దుర్వాసన వ్యాపించడంతో ఈ ప్రాంతాల్లో నిత్యం సంచరించే వేలాది మంది ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరేమనుకుంటే మాకేంటి.. మా బాణీ మాదే అన్నట్లు నగరపాలక సంస్థ అధికారుల ప్రవర్తన ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వహణ లోపంతో పెద్ద ఎత్తున పూడికలు



కలెక్టరేట్ ప్రహరీని ఆనుకుని ఉన్న డ్రెయిన్ వద్ద పెరిగిన తప్పలు

జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లోని అన్ని డ్రెయినేజీల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో పెద్ద ఎత్తున షిల్ట్, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో వర్షం చినుకులు కురిస్తే చాలు మురుగు నీరు రోడ్ల మీదకు వచ్చి ఈ మార్గం గుండా వెళ్లే వారికి అవస్థలు తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం వందలాది మంది యువ ఆటగాళ్లు, వాకర్స్ వచ్చి వెళ్లే ఇండోర్ స్టేడియంలోకి సైతం నీరు వచ్చి చేరి కొన్ని రోజులు ఆటలకు, వాకింగ్‌కు అంతరాయం కలుగుతోంది. ఇదంతా డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారవడమే కారణమని ఇండోర్ స్టేడియంకు వచ్చి పోయేవారు విమర్శిస్తున్నారు.



అన్నా క్యాంటీన్ వెనుక వైపు స్టేట్ బ్యాంక్‌కు వచ్చే మార్గంలోని డ్రెయినేజీ

పిచ్చిమొక్కలు, పొదలతో పూడుకు పోయిన డ్రెయిన్లు

కలెక్టరేట్ ప్రహరీని ఆనుకుని, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ప్రహరీ పక్కన పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోయాయి. దీనివల్ల గోడను ఆనుకుని ఉన్న డ్రెనేజీలు పూర్తిగా మూసుకుపోయాయి. దీంతో పాములు, విషపు పురుగులు ఈ ప్రాంతంలో చేరుతున్నాయి. వర్షం పడి మురుగు నీరు రోడ్లపైకి చేరే సమయంలో పిచ్చి మొక్కలు, పొదుల్లో ఉన్న పాములు, విష పురుగులు రోడ్లపైన జలకాలాడుతున్నాయి. ఇంత జరుగుతున్నా కనీసం డ్రెయిన్లలో పేరుకుపోయిన షిల్ట్, పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.



స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఎదురుగా ప్రహరీని ఆనుకుని పూడుకుపోయిన డ్రెయినేజీ

రోడ్లపై ముగ్గు, బ్లీచింగ్ చల్లితే సరిపోతుందా?

ఎవరైనా మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలోని జిల్లా పరిషత్ అతిథి గృహానికి వచ్చే సందర్భాల్లో పెద్ద ఎత్తున రోడ్డుకు ఇరువైపులా ముగ్గు, బ్లీచింగ్ చల్లేస్తున్నారు. కనీసం దీనిపై పెట్టిన శ్రద్ధలో పావు వంతు డ్రెయినేజీ పూడిక తీతలపై పెట్టి ఉంటే బాగుంటుందని ప్రజలు సూచిస్తున్నారు. కనీసం ఈ మార్గం గుండా రోజూ రాకపోకలు సాగించే జిల్లా స్థాయి అధికారులు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయిన్లు అస్తవ్యస్తం



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని డ్రెయినేజీలన్నీ అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు డ్రెయినేజీల్లోని పూడికతీతకు రూ.లక్షలు వెచ్చించినట్లు ప్రచారం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. తక్షణం డ్రెయినేజీల్లోని షిల్ట్, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి మురుగు నీరు సాఫీగా ముందుకు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి.

– బి.జగన్నాథరావు,సీఐటీయూ నాయకులు,ఏలూరు

కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం



నగరంలోని డ్రెయిన్లను ఎప్పటికప్పుడు పూడికలు తీయకపోవడం వల్ల కొద్దిపాటి వర్షానికే మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నాయి. దీంతో రహదారుల గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు తీవ్ర అసౌకర్యానికి గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణం నగరపాలక సంస్థ పరిధిలోని డ్రెయినేజీలను పూడిక తీయడంతో పాటు అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలి.

– బి.చంద్రశేఖర్, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఏలూరు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఈ నెల 8న నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం. అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏలూరు డీ4 సెక్షన్ పరిధిలో 11 కేవీ మాధవపురం ఫీడర్ పరిధిలో మాధవపురం, పాలగూడెం, ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ లైన్‌లో, ఏలూరు మండలంలోని, 33 కేవీ ఏలూరు సబ్‌స్టేషన్ పరిధిలో రామకృష్ణాపురం, గులాబీ తోట, నెహ్రూ కాలనీ, విజయ గార్డెన్స్, మినీ బై పాస్, పవర్ పేట, పాత బస్టాండ్, గూడ్స్ షెడ్డు రోడ్డు, వసంత మహల్ సెంటర్, పడమర వీధి, గొల్లాయ గూడెం, సుబ్రహ్మణ్యం కాలనీ, వంగాయగూడెం, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

పవన్ వ్యాఖ్యలు బాధాకరం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితపై జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. స్థానిక దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోంశాఖ నిర్వహణలో లోపాలు ఉంటే సీఎం చంద్రబాబు దృష్టికి పవన్‌కల్యాణ్ తీసుకువెళాలని, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని వస్తువుల వేలం

ఏలూరు టౌన్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని పలు రకాల వస్తువులు వేలం వేసేందుకు చర్యలు చేపట్టామని, ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో మేనేజర్ కె.వెంకటరామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ఏలూరులోని లిక్కర్ డిపో వద్ద ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేస్తామని ఆసక్తి కలిగిన వారు రూ.50వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గోవాలన్నారు. ఈ వేలంలో ఫ్రీజర్లు 108, ఇన్వెర్టర్ విత్ బ్యాటరీ 126, క్యాష్ చెస్ట్‌లు 110, స్కానర్లు 248, క్యాష్ కౌంటింగ్ మెషీన్లు 120 ఉంటాయని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ 8008123152, మేనేజర్ 95507 96439 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అపార్‌కు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న అపార్‌కు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీనగర్ నగర బాలికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ (ఆటోమేటెడ్ ఐడీ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టరి) నమోదులో భాగంగా ఇంటర్ వరకు చదువుకున్న ప్రతి విద్యార్థి వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆధార్‌లోని వివరాలు, పాఠశాల రిజిస్ట్రేషన్‌లోని వివరాలు, యూ–డైస్ ప్లస్‌లోని వివరాలు ఒకేలా ఉండాలన్నారు.

రికార్డుల తనిఖీ

పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టీని, పాఠశాలలో పారిశుద్ధ్యం,తాగునీరు, మధ్యాహ్న భోజన పథకం తీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు అందజేసే విధంగా



ఏలూరు కొత్తపేట వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఉపాధ్యాయులు తరచూ భోజనాన్ని తనిఖీ చేస్తుండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనరు ఎ.భాను ప్రతాప్, తహసీల్దారు జీవీ శేషగిరి, డిప్యూటీ కమిషనరు శివారెడ్డి, మున్సిపల్ ఇంజనీరు సురేంద్ర బాబు, డీఈ తాతబ్బాయి ఉన్నారు.

వార్డు సచివాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఏలూరు(మెట్రో): ఏలూరు కొత్తపేట ప్రాంతంలోని నగరంలోని 41, 42 డివిజన్లకు సంబంధించిన వార్డు సచివాలయాన్ని బుధవారం కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన విధుల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా సమర్థవంతంగా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు.

వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా

ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వారి పరిధిలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. పన్ను వసూళ్ల తీరును సంబంధిత రిజిస్టర్ ద్వారా పరిశీలించారు. వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి లైట్లు వెలిగేలా సంబంధిత సచివాలయ సిబ్బంది రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో సచివాలయ సిబ్బంది ఉండాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనరు ఎ.భానుప్రతాప్, తహసీల్దారు జి.వి.శేషగిరి, డిప్యూటీ కమిషనరు శివారెడ్డి, మున్సిపల్ ఇంజనీరు సురేంద్రబాబు, డీఈ తాతబ్బాయి ఉన్నారు.

క్రాడిల్ సెంటర్ పునరుద్ధరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్‌లో క్రాడిల్ రిసెప్షన్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ బుధవారం పునరుద్ధరించారు. ఈనెల 7న గర్భస్థ శిశు దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా క్రాడిల్ రిసెప్షన్ సెంటర్, చంటి బిడ్డల తల్లులు పాలిచ్చే గదులను సందర్శించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా వద్దు అనుకున్న బిడ్డలను రోడ్డు పక్కన, కాలవల్లో, చెత్త బుట్టల్లో విడిచి పెట్టకుండా, ఇటువంటి ఉయ్యాలలో విడిచిపెట్టాలని కోరారు. అలాగే పౌరులు బాధ్యత తీసుకుని 1098 లేదా 100, 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆ బిడ్డల రక్షణను అధికారులు తీసుకుంటారని,



కొత్త బస్టాండులో క్రాడిల్ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రత్న ప్రసాద్

వారిని సంరక్షించడం లేదా చట్ట ప్రకారం దత్తత ఇవ్వడం చేస్తారని తెలిపారు. ఈ క్రాడిల్ రిసెప్షన్ సెంటర్లు కొత్త బస్టాండ్, గవర్నమెంట్ హాస్పిటల్, శిశు గృహాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ పీ. పద్మావతి, డీసీపీఓ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

23న ఏఐటీయూసీ సర్వసభ్య సమావేశం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 23న జంగారెడ్డిగూడెం క్లబ్ హాల్, రాజుల కాలనీలో నిర్వహించనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జనరల్ బాడీ సమావేశం జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో బుధవారం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే విగ్నేష్, భజంత్రీ శ్రీనివాసు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షుడు కంకిపాటి బుచ్చిబాబు, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, పుల్లారావు, కుంచే వసంతరావు, ఏఐటీయూసీ ఏలూరు నగర కార్యదర్శి ఏ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి సీపీఎం ప్రజాపోరు యాత్ర

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో 8 నుంచి 14వ తేదీ వరకు ప్రజా పోరుయాత్ర ఏలూరు నగర కార్యదర్శి పి కిషోర్ తెలిపారు.స్థానిక పవరుపేటలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం ఏలూరు నగర కమిటీ సమావేశం రవి కిషోర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై ధరల భారం మోపుతోందని విమర్శించారు. ప్రజలపై కరెంటు చార్జీల భారం పెంచిందని అన్నారు. వంట నూనెలు, పప్పు దినుసులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ధరలను అదుపు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇసుక ఉచితం పథకం విఫలమైందని విమర్శించారు. ఏలూరు పట్టణంలో 8 నుండి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఏలూరు మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నాని నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ నగర కమిటీ సభ్యులు బి జగన్నాథరావు, జి రవికిషోర్ పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఆవిర్భావ వేడుకల సందర్భంగా డిసెంబర్ 26న పెద్ద ఎత్తున వాడవాడలా పార్టీ పతాకాల ఆవిష్కరణ సభలు, సమావేశాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఏలూరు స్ఫూర్తి భవనంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గం, జిల్లా సమితి సమావేశం ఎండీ మున్నీరు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న దేశంలో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ 99 ఏళ్లుగా స్వతంత్ర ఉద్యమంలో, అనంతరం దేశంలోని ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించిన చరిత్ర పార్టీకి ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు పలు అంశాలు వివరించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి, ప్రొఫెసర్ సాయిబాబా, జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు తదితరుల మృతికి సంతాపం తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.



సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ

ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఏలూరు (టూటౌన్): 75 కేజీల బస్తా ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.1,725 ప్రకటించినా దళారులు రైతుల నుంచి ధాన్యాన్ని 1,400 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని, రైతు పండించే ధాన్యాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి. శ్రీలక్ష్మికి ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు, రైతులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా కాగా ఇందులో 3.40 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని లక్ష్యంగా ప్రకటించారని చెప్పారు. రైతులు పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా ప్రకటించడం



పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

వల్ల మిగిలిన పంటను దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తేమ శాతం నిబంధనలు మార్పు చేయాలని కోరారు. 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.జగదీష్, పి.దావీదు పాల్గొన్నారు.

మోదీ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా ఉద్యమం



వైఎంహెచ్ఏ దగ్గర స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మోదీ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు, ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర్ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విప్లవ ఉద్యమంలో అమరులైన వీరులకు జోహార్లు అర్పిస్తూ బుధవారం సాయంత్రం ఏలూరు కల్పనా థియేటర్ వద్ద నుంచి బిర్లాభవన్ సెంటర్ మీదుగా వైఎంహెచ్ఏ వద్దకు ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద సభలో సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఏలూరు నగర నాయకులు యర్రా శ్రీనివాసరావు, గడసాల రాంబాబు, ముంగం అప్పారావు, పీడీఎస్‌యూ జిల్లా ప్రెసిడెంట్ కాకి నాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దూళ్ల వీరి నాయుడు, వీరభద్రం, ఎం. క్రాంతి, సందకం అప్పారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ విధానంపై అవగాహన పెంచుకోండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అత్యవసర పరిస్థితుల్లో మనిషి ప్రాణాన్ని కాపాడటానికి సీపీఆర్ విధానం అత్యంత ప్రధానమైనదని దీని ద్వారా మనిషి ప్రాణాన్ని కాపాడడం మాత్రమే కాకుండా ఒక కుటుంబాన్ని ఆదుకోవడమేనని, ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేసే విధానాన్ని నేర్చుకోవాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సభ్యులు, ప్రముఖ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ చిన్ని సత్యనారాయణ సూచించారు. నగరానికి చెందిన సీఆర్ఆర్ కళాశాల ఎంబీఏ, ఏలూరు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో బుధవారం లైఫ్ సేవింగ్ స్కిల్స్, సీపీఆర్ విధానం, మానసిక ఆరోగ్యం అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్ని సత్యనారాయణ పలు అంశాలు వివరించారు. ప్రముఖ మానసిక వ్యాధి నివారణ కన్సల్టెంట్ అక్కింశెట్టి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రముఖ వైద్యుడు రావి గోపాల కృష్ణయ్య, దిరిశాల వరప్రసాద్, దాసర గణేష్ బాబు, కే. అశోక్ రెడ్డి, వంకినేని కిషోర్, సీఆర్ఆర్ పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస రావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రామరాజు, పీజీ కళాశాల డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి, ఎంబీఏ డైరెక్టర్ రంగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మనోబలంతో క్యాన్సర్‌ను జయించండి

ఏలూరు రూరల్: మనోబలం, అవగాహనతో క్యాన్సర్‌ను జయించవచ్చని ఆశ్రం ఆసుపత్రి సీఈఓ డాక్టర్ కె హనుమంతురావు అన్నారు. బుధవారం ఆశ్రం ఆవరణలో క్యాన్సర్ రోగులకు మనోధైర్యం కల్పించేందుకు శ్రేయస్సు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సాంత్వన కల్గించేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రోగుల్లో భయాందోళన తొలిగితే చికిత్స మరింత సత్ఫలితాలు అందిస్తుందన్నారు. జాతీయస్థాయిలో రొమ్ము, గర్భాశయ, ముఖద్వార తదితర క్యాన్సర్ బారిన ఎక్కువ మంది పడుతున్నారని వివరించారు. డాక్టర్ శైలజ, సింధు, కన్మణి, రాజరాజన్ వైద్య విధానాలపై అవగాహన కల్పించారు.

ట్రాన్స్‌జెండర్లకు వ్యాక్సినేషన్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ట్రాన్స్‌జెండర్లకు వ్యాక్సిన్లు వేశారు. ఏలూరు జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ కేంద్రంలో ట్రాన్స్‌జెండర్లకు పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్లు వేశారు.